క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



సాయివ్రతాల్లో పాల్గొన్న భక్తులు

వీరపునాయునిపల్లె: వేంపల్లె, ఎర్రగుంట్ల ప్రధాన రహదారిలోని పాలగిరి పాలగిరి క్రాస్ వద్ద వెలసిన షిర్డీసాయిబాబా ఆలయ 3వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయంలోని మూల విరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తి శ్రద్ధలతో సాయివ్రతాలు చేపట్టాలరు. ఈ వ్రతాల్లో మహిళలతో పాలు పురుషులు పాల్గొన్నారు. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తాళాల భజన కార్యక్రమం అందరినీ ఆకట్టుకొంది. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు అతిథి భోజనం



విద్యార్థినులకు అతిథి భోజనాన్ని వడ్డిస్తున్న ప్రసాద్‌రెడ్డి కుటుంబ సభ్యులు

వేముల : మండల కేంద్రమైన వేములలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం విద్యార్థులకు అతిథి భోజనం ఏర్పాటు చేశారు. మండలంలోని గొందిపల్లె గ్రామానికి చెందిన కలంకుంట్ల జయచంద్రా రెడ్డి, పార్వతమ్మల కుమారుడు కలంకుంట్ల గంగా ప్రసాద్‌రెడ్డి 5వ వర్ధంతిని పురస్కరించుకుని 250 మంది విద్యార్థినులకు అతిథి భోజనాన్ని అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శారదమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ



మసీదు కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న కమిషనర్ జగన్నాథ్

కమలాపురం: ముస్లింల పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని అన్ని మసీదుల వద్ద పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. సోమవారం పట్టణంలోని అన్ని మసీదుల వద్ద ఆయన పర్యటించారు. ప్రతిరోజు తప్పనిసరిగా అన్ని మసీదుల వద్ద శానిటేషన్ చేయాలని సిబ్బందికి సూచించారు. మున్సిపల్ శాఖ తరుపున మసీదుల వద్ద అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల నరసింహులు, శానిటరీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

అదుపు తప్పిన కారు
– ఇరువురికి గాయాలు



పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

లింగాల : లింగాల మండలం పార్నపల్లె గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి ఒక కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న తురకవానిపల్లె గ్రామానికి చెందిన రమేష్, పార్నపల్లెకు చెందిన సులోచన గాయపడ్డారు. వారిని వెంటనే అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా.. రమేష్‌కు బలమైన గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం బెంగుళూరుకు తరలించారని వారి కుటుంబ సభ్యులు తెలిపారు. రాత్రి ప్రమాదంలో జరగడంతో ఆలస్యంగా గుర్తుపట్టిన ప్రయాణీకులు వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారని తెలిపారు.

పైప్‌లైన్ లీకేజీతో నీటి వృథా



టి.సుంకేసుల గ్రామంలో మురికినీటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకట రమణయ్య

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని తిప్పలూరు గ్రామ పంచాయతీ పరిధిలోని టి. సుంకేసుల గ్రామంలో పైపులైన్ లీకేజీల కావడంతో రోడ్డుపై నీరు ప్రవహించి రోడ్డంతా పాచి పట్టి దుర్గంధం వెదజల్లుతుందని స్థానికులు వాపోయారు. సోమవారం ఎంపీడీఓ వెంకటరమణయ్య గ్రామంలో పర్యటించి చర్యలు చేపట్టాలని సూచించారు. లీకేజీలతో నీరు వృథాగా పోతున్న ఎందుకు పట్టించుకోలేదని సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారిని ప్రశ్నించారు. వెంటనే చర్యలు తీసుకోని పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

చలివేంద్రాలు ఉపయోగకరం

కడప కోటిరెడ్డి సర్కిల్ : వేసవి కాలంలో చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరమని జేబీవీఎస్ ప్రిజర్వెర్ సేవా సమితి వ్యవస్థాపకుడు అశోక్ అన్నారు. కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాల సమీపంలో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు.

ముంచుకొస్తున్న ముప్పు

వేసవి వచ్చేసింది. ఎండలు మండిపోతున్నాయి. ఇప్పటికే నియోజకవర్గంలో కొన్ని చోట్ల తాగు నీటి సమస్య వచ్చింది. వేసవి తీవ్రత దృష్ట్యా ఉన్న నీటిని పొదుపుగా వాడుకోకపోతే తాగునీటి ముప్పు తప్పదు. ఏ ఏ జలాశయంలో ఎంత నీరు నిల్వ ఉంది..? పరిసర గ్రామాల్లో తాగునీటి అవసరాలు ఎలా ఉన్నాయి? అనే అంశాలను అధికారులు పరిశీలించి రాబోయే రోజుల్లో వేసవి నీటి ఎద్దడి నివారణ చర్యలు తీసుకోవాలి. నీటి వినియోగంలో ముందస్తు చర్యలు తీసుకోకపోతే ఇబ్బందులు తప్పవు.

- తలెత్తనున్న తాగునీటి సమస్య
- అధికారులు మేలుకోకుంటే కష్టాలే
- పొదుపు చేయకుంటే ఇబ్బందులే



నీళ్ల కోసం ట్యాంకర్ వద్ద క్యూలో నిల్చున్న మహిళలు (ఫైల్)

పులివెందుల: పులివెందుల నియోజకవర్గంలో తాగునీటి సమస్యలు తీవ్రరూపం దాల్చలేదు. మండలాల్లోని కొన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య ఉన్నప్పటికి నీటి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. ఏప్రిల్ నుంచి మరికొన్ని గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. మండలాల వారీగా తాగునీటి సమస్యకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

తొండూరు మండలం	
మొత్తం జనాభా	16,250
కుటుంబాల సంఖ్య	7,200
గ్రామ పంచాయతీలు	15
మజారా గ్రామాలు	12
చేతి బోర్ల సంఖ్య	35
పనిచేసేవి	12

తొండూరు మండల వ్యాప్తంగా ఇప్పటివరకు ఎలాంటి తాగునీటి సమస్య లేదు. రాబోయే వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొనవచ్చు. తొండూరు మండలంలో పైడిపాలెం నుంచి సంతకొవ్వూరు కెనాల్‌కు నీరు ప్రవహించడంతో మండలంలో చిన్న, చిన్న కాలువలు, చెరువులలో నీరు ఉండటం ల్ల భూగర్భ జలాలు నీరు పుష్కలంగా ఉన్నాయి. దీంతో నీటి సమస్య లేదు.

సింహాద్రిపురం మండలం	
మొత్తం జనాభా	37,426
మొత్తం కుటుంబాలు	9,240
మండలవ్యాప్తంగా ఉన్న బోర్లు	41
మండలంలోని చేతి బోరు	217

మండలంలోని ప్రజలకు 58.40మిలియన్ల లీటర్ల నీరు అవసరం ఉంది. ఎన్ని మిలియన్లు తాగునీరు సరఫరా చేస్తున్నారో అధికారులు తెలపాల్సి ఉంది. ఇప్పటికే భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టడంతో మంచినీటి అందించే ప్రాజెక్టులలో నీరు అంతంత మాత్రంగా ఉంది. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో తాగునీటి సమస్య ఉత్పన్నమవుతుందని ప్రజలు పేర్కొంటున్నారు.

చక్రాయపేట మండలం	
మొత్తం జనాభా	31,258
కుటుంబాల సంఖ్య	7,920
గ్రామ పంచాయతీలు	16
మజారా గ్రామాలు	122
చేతి బోర్ల సంఖ్య	320
పనిచేసేవి	290
నీటి పథకాలు	10
పనిచేసేవి	9

మండలంలోని గడ్డంవారిపల్లెలో తాగునీటి సమస్య ఉంది. అలాగే గొంది, గడ్డంవారిపల్లె గ్రామాలకు ప్రస్తుతం అధికారులు నీటి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. వీరనారాయణపల్లెలో కూడా నీటి సమస్య ఉంది. అయితే మరో 20 రోజులపాటు సమస్య రాకపోవచ్చును. ఆ తర్వాత ఎన్ని పథకాలు ఎన్ని బోర్లు ఎండు ముఖం పడతాయో అర్థం కాని పరిస్థితి ఉంటుందని అధికారులు చర్చించుకుంటున్నారు.

వేముల మండలంలోని ఏ గ్రామంలోనూ ఇప్పటివరకు తాగునీటి సమస్య తలెత్తలేదు. అయితే వేసవి దృష్ట్యా భూగర్భజలాలు అడుగంటే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో చెరువులను నీటితో నింపాల్సిన అవసరం ఉంది.

వేంపల్లె మండలం	
మొత్తం ఓటర్లు	46,031
పురుషులు	22,520
స్త్రీలు	23,511
పోలింగ్ కేంద్రాలు	65
గ్రామపంచాయతీలు	17
రెవెన్యూ గ్రామాలు	11
మొత్తం కుటుంబాలు	13,886
మొత్తం మండల జనాభా	61,344
చేతి బోర్ల సంఖ్య	219
పనిచేస్తున్నవి	199
తాగునీటి బోర్లు	78
పని చేస్తున్నవి	76

వేంపల్లె మండల వ్యాప్తంగా ఇప్పటివరకు ఎలాంటి తాగునీటి సమస్య లేవు. భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయి. కానీ నీటి సమస్య రాలేదు.

సూపర్ సిక్స్ ఓ బూటకం

- 'యువత పోరు' జయప్రదం చేయండి
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సుధీర్‌రెడ్డి



ఎర్రగుంట్ల : పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సుధీర్‌రెడ్డి , నాయకులు

ఎర్రగుంట్ల : కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల అమలు ఒట్టి బూటకమని జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే డాక్టరు ఎం సుధీర్‌రెడ్డి అన్నారు. యర్రగుంట్ల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తున్న యువ పోరు పోస్టర్ విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలలు గడుస్తున్నా ఒక్క పథకం కూడా అమలు చేయాలేదని దుయ్యబట్టారు. విద్యా దీవెన , వసతి దీవెన, నిరుద్యోగ భృతి ఇప్పటి వరకూ ఇవ్వలేదని అన్నారు. తల్లి దండ్రులు అప్పులు చేసి పిల్లలను చదివిస్తున్నారని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య. పట్టణాధ్యక్షుడు జయరామకృష్ణారెడ్డి, ట్రేడ్ యూనియన్ నాయకుడు రమణారెడ్డి, యువజన నాయకుడు హరీష్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ విభాగంగా రాష్ట్ర నాయకుడు వీరభాస్కర్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, షాహిద్, రుద్రసేనరెడ్డి పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

పులివెందుల రూరల్ : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గంగాధర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నూర్ బాషా సంఘ అధ్యక్షుడు రసూల్, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబు రెడ్డి, సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కౌన్సిలర్ కోడి రమణ తెలిపారు. సోమవారం పట్టణంలోని స్థానిక వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో యువత పోరు పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ సర్వోత్తమ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కోళ్ల భాస్కర్, వీరారెడ్డి, శ్రీరాములు, జస్వంత్ రెడ్డి, రాజేష్, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



జమ్మలమడుగు: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జమ్మలమడుగు: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 12వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న యువపోరును జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి కోరారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, మైలవరం మండల కన్వీనర్ మహేశ్వరరెడ్డి, సర్పంజి కొట్టాల సుబ్రహ్మణ్యం, గురప్ప, కో–ఆప్షన్ సభ్యుడు లక్ష్మయ్య, బోనం సురేష్ పాల్గొన్నారు.

'యువత పోరు'కు తరలిరండి

చింతకొమ్మదిన్నె : వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథరెడ్డి ఆధ్వర్యంలో మార్చి నెల 12వ తేదీన జరిగే యువత పోరు కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని వైస్సార్‌సీపీ కమలాపురం నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రెటరీ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు.



పులివెందుల రూరల్ : యువత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, నాయకులు

రైతు సేవా కేంద్రాల్లో పంటల నమోదు జాబితా



పంటల నమోదు జాబితాను చూస్తున్న రైతులు

వీరపునాయునిపల్లె: రబీ 2024–25కు సంబంధించి రైతులు సాగు చేసిన పంటల నమోదు జాబితా మండలంలోని 15 రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలవ్యాప్తంగా 6,671 మంది రైతులు, 25,410 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారని తెలిపారు. పంట సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు జాబితాల్లో ఉందా లేదా అని చూసుకోవాలని, అంతే కాకుండా ఏవైనా పొరపాట్లు ఉంటే వాటిని గుర్తించి ఈ నెల 12వ తేదీ లోపు రాత పూర్వకంగా సంబంధిత వ్యవసాయ సిబ్బందికి తెలపాలని సూచించారు. రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి 22వ తేదీన తుది జాబితాను విడుదల చేయడంతో పాటు గ్రామ సభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. భూమి ఉన్న ప్రతి రైతు విశిష్ట గుర్తింపు కార్డు కొరకు ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

భవిత ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలి



సమగ్ర శిక్ష రాష్ట్ర ఐఈ అబ్జర్వర్ కల్పనకు వినతి పత్రం అందజేస్తున్న ఐఈఆర్టీలు

వేంపల్లె : భవిత కేంద్రంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం క్రమబద్ధీకరించి తగిన న్యాయం చేయాలని ఐఈఆర్టీలు సమగ్ర శిక్ష స్టేట్ ఐఈ అబ్జర్వర్ కల్పన శైలాను కోరారు. సోమవారం తనిఖీల్లో భాగంగా కడపకు వచ్చిన ఆమెను ఐఈఆర్టీలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఐఈఆర్టీలు సిద్దారెడ్డి, రవికుమార్, చంద్రశేఖర్, కరుణాకర్, వంశీకృష్ణ, విజయమ్మ, యశోద, మమత, అనురాధ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రొద్దుటూరు : ఎన్జీఓల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ తాలూకా అధ్యక్షుడు రఘురామిరెడ్డి తెలిపారు. సోమవారం ఎన్జీఓ హోంలో ఎన్జీఓ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దివంగత అమనగంటి శ్రీరాములు 104వ జయంతి సందర్భంగా నివాళి అర్పించారు.

అవినీతి అధికారులను అందలం ఎక్కించవద్దు



జిల్లా పంచాయతీ అధికారిణి రాజ్యలక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

వేంపల్లె : వేంపల్లె గ్రామ పంచాయతీలో అవినీతి అధికారులను అందలం ఎక్కించవద్దని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ అన్నారు. సోమవారం కడపలోని జిల్లా పంచాయతి అధికారిణి రాజ్యలక్ష్మిని ఆయన కలిసి వినతి పత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల పంచాయతీ కార్యాలయంలో ఇష్టానుసారంగా ప్రజల వద్ద పన్నుల రూపంలో రూ.76లక్షలు వసూలు చేసి ప్రభుత్వానికి జమ చేయకుండా సొంతానికి వాడుకున్నారన్నారు. అయితే వారిపై జిల్లా అధికారుల వద్ద విచారణ చేసి నివేదిక సమర్పించినా ఇంత వరకు చర్యలు తీసుకోలేదన్నారు. అదే విధంగా ఇక్కడ అవినీతికి పాల్పడిన జూనియర్ అసిస్టెంట్‌ను డిప్యూటేషన్ మీద పోరుమామిళ్లకు బదిలీ చేస్తే అక్కడ కూడా అవినీతికి పాల్పడి తిరిగి వేంపల్లెకు వచ్చి 20నెలలుగా ఏ పని చేయకుండా జీతం తీసుకుంటున్న అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నేషనల్ కౌన్సిల్ సభ్యులు రామచంద్రా రెడ్డి, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ' జయప్రదం చేయండి



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు

వేంపల్లె: భవన నిర్మాణ కార్మికులకు హక్కుల కోసం ఈనెల 28న చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు పిలుపునిచ్చారు. సోమవారం వేంపల్లెలోని స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సంక్షేమ బోర్డులు తరహాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా సంక్షేమ బోర్డులో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నప్పటికీ సంక్షేమ బోర్డు అమలు చేయకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ కడప జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏసోబు, మన్నెం నాగేశ్వర రావు, బాలాజీ, దస్తగిరి, వెంకటేష్ పాల్గొన్నారు.

ఒలంపియాడ్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

సింహాద్రిపురం : హైదరాబాద్ రవీంద్ర భారతి ఆడిటోరియంలో ఈనెల 9వ తేదీన ఆదివారం ఎయిమ్స్ ఒలంపియాడ్ హంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో సింహాద్రిపురంలోని శ్రీవివేకానంద ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. శ్రీవివేకానంద ఉన్నత పాఠశాల విద్యార్థులు హిమజ జాతీయస్థాయిలో 8వ ర్యాంక్, జస్మితారెడ్డి రాష్ట్రస్థాయిలో 10వ ర్యాంకు, మహమ్మద్ సజన్ జోనల్‌స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను సన్మానించి మెడల్స్ అందించారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ కె.ఖాదర్ వలి, డైరెక్టర్ కె.జాఫర్, హెడ్ మిసెస్ సెహనాజ్ బేగం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.



విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రముఖులు

సేంద్రియ ఉత్పత్తులతోనే ఆరోగ్య రక్షణ



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న మహిళ

ముద్దనూరు: సేంద్రియ సాగుతో పండించే పంటల ఆహార ఉత్పత్తులతోనే మానవాళికి ఆరోగ్య రక్షణ అని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుడు డాక్టర్ నాగార్జున అన్నారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయాల విక్రయకేంద్రాన్ని మండల వ్యవసాయాధికారితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన రహితంగా పండించిన కూరగాయలను గర్భిణులు, బాలింతలు తప్పకుండా వినియోగించాలని, దీంతో పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. ఏఓ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రతినెల 9వతేదీన ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా నాణ్యమైన కూరగాయాలను విక్రయించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

'అమనగంటి' సేవలు చిరస్మరణీయం

కడప రూరల్ : ఏపీ ఎన్జీఓ సంఘం వ్యవస్థాపకులు కామ్రేడ్ అమనగంటి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు అన్నారు. శ్రీరాములు జయంతి సందర్భగా సోమవారం స్థానిక జిల్లా కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీరాములు జీవిత కాలమంతా ఉద్యోగుల హక్కుల కోసం పోరాడిన మహనీయుడని అన్నారు. ఉద్యోగులు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. నాయకులు రవికుమార్, నిత్యపూజయ్య, టీ తిమ్మారెడ్డి, బాల పుల్లయ్య పాల్గొన్నారు.

నిర్బంధంతో ఉద్యమాన్ని నిలువరించ లేరు



జమ్మలమడుగు: ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు



వేంపల్లి: తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

జమ్మలమడుగు: తమ హక్కుల సాధనకోసం ఉద్యమిస్తున్న అంగన్‌వాడీలను అక్రమ అరెస్టులతో నిర్బంధాలతో నిలువరించలేరని సీఐటీయూ గౌరవాధ్యక్షుడు ఏసుదాసు పేర్కొన్నారు. సోమవారం స్థానిక సీడీపీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల అక్రమ అరెస్టులకు నిరసనగా ధర్నా కార్యక్రమాన్ని ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్, సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు లక్ష్మీదేవి, భాగ్యలక్ష్మి, సీఐటీయూ నాయకులు వినయ్, శేఖర్, నాగన్న, మాధవి, శ్రీదేవి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల అరెస్ట్ దుర్మార్గం

కమలాపురం: చలో విజయవాడ వెళ్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్స్‌ను అరెస్ట్ చేయడం దుర్మార్గమని సీపీఐ కమలాపురం ఏరియా కార్యదర్శి చంద్ర శేఖర్ మండిపడ్డారు. సోమవారం కమలాపురంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మాతా శిశు మరణాలు తగ్గించడంతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు అనేక రకాలు సేవలు అందిస్తున్న అంగన్‌వాడీల సమస్యలపై విజయవాడలో తలపెట్టిన మహా ధర్నాకు వెళ్తున్న అంగన్‌వాడీలను పోలీసులు ఎక్కడికక్కడ నిర్బంధించి అరెస్ట్ చేయడం దారణమన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

చలో విజయవాడ వెళ్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లను పోలీసులు అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని ఏఐటీయూసి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏరియా కార్యదర్శి రాణి, సీపీఐ ఏరియా కార్యదర్శి నాగేశ్వర్ రావు అన్నారు. సోమవారం వారు ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి అక్కడ ధర్నా చేసి వినతి పత్రాన్ని తహసీల్దార్ శివరామిరెడ్డికి అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు లక్ష్మీదేవి, అరుణ, యశోద పాల్గొన్నారు.

వేంపల్లె : అంగన్‌వాడీ కార్యకర్తలను చలో విజయవాడ వెళ్తుంటే పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గపు చర్య అని వేంపల్లెలోని అంగన్‌వాడీలు పేర్కొన్నారు. సోమవారం పోలీసులు అడ్డుకోవడానికి నిరసనగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ హరినాథ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం అందించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సరస్వతి, శైలజ, నాగేశ్వరి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

పనికి తగ్గ వేతనాలు చెల్లించాలి

కొండాపురం: ఎన్నికల ముందు కూటమి అధికారంలోకి వస్తే అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆయాలకు పనికి తగ్గ చెల్లించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరారు. సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మినీ అంగన్‌వాడీ సెంటర్‌లను మెయిన్ సెంటర్‌గా మార్చి సమస్యలను పరిష్కరించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్‌గా ఇవ్వాలన్నారు. ధర్నా అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన

ఎర్రగుంట్ల : సమస్యల పరిష్కారం కోసం చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయాలను పోలీసులు అడ్డకోవడం దారణమని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు చాంద్‌బాషా అన్నారు. సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలతో కలసి నిరసన వ్యక్తం చేసి, తహసీల్దార్ శోభన్‌బాబుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కమలాపురం: ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు